
క్లుప్తంగా

శ్రీరామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో సోమవారం స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం చేశారు. అనంతరం విశేషంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రుణాల కోసం దరఖాస్తు చేసుకోండి



నున్న(విజయవాడరూరల్): మహిళలు రుణసదుపాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని డీఆర్‌డీఏ అసిస్టెంటు ప్రాజెక్టు మేనేజర్ గంధం చంద్రశేఖర్ సూచించారు. నున్న గ్రామం లైబ్రరీ సెంటర్‌లో సోమవారం గ్రామైఖ్య సంఘాల సహాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు జీవనోపాధిని మెరుగుపర్చుకునేందుకు ఒక్కో సభ్యురాలికి పీఎంఈజీపీ పథకాలకు యూనిట్‌కు పదిలక్షల రూపాయల వరకు రుణసదుపాయం నున్న స్టేట్ బ్యాంకు నుంచి లభిస్తోందన్నారు. లక్ష రూపాయలకు 35 శాతం సబ్సిడీ ఉందన్నారు. అవసరమైన ఆన్‌లైన్ అప్లికేషన్స్, పథకానికి అవసరమైన డీపీఆర్ అన్ని మండల ఏపీఎం కార్యాలయాల్లో లభిస్తాయని తెలిపారు. సమావేశంలో సీసీ ఎం.రామారావు, వీఓఏలు పాల్గొన్నారు.

వికాస్ కాలేజీ అధ్యాపకునికి డాక్టరేట్



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతిగా పనిచేస్తున్న బి.సురేష్‌కు అన్నామలై యూనివర్సిటీ చెన్నై వారు పీహెచ్‌డీ ప్రదానం చేశారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో 'రూటింగ్ ప్రోటోకాల్ ఫర్ ఎలిమినేటింగ్ డేటా రెడన్‌డెన్సి అండ్ ఆప్టిమైజింగ్ ఇన్ వైర్లెస్ సెన్సార్ నెట్వర్క్' అనే అంశంపై పరిశోధన చేసినందుకుగాను పీహెచ్‌డీ ప్రదానం చేశారు. సోమవారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ ఎస్.సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ పీఎస్ శ్రీనివాస్ అభినందించి డాక్టరేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ కళాశాలలో అధ్యాపకులను పరిశోధనల దిశగా ప్రోత్సహిస్తామని తెలిపారు. డాక్టరేట్ స్వీకరించిన బి.సురేష్ కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం మడిచర్ల విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీసీపీడీసీఎల్ గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మడిచర్ల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

విద్యుత్ లోఓల్టేజి సమస్యను పరిష్కరించండి

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక హనుమాన్ నగర్‌లో విద్యుత్ లోఓల్టేజి సమస్యను పరిష్కరించాలని కోరుతూ హనుమాన్ జంక్షన్ ఏఈ ఎ.శ్రీనివాసరావుకు సోమవారం ఆ కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. విద్యుత్ లోఓల్టేజి సమస్యతో తరచూ గృహోపకరణాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాపోయారు. మహాత్మ గాంధీ విగ్రహం ఏరియాలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మార్పు చేయాలని కోరారు. కొమిరిశెట్టి కుమార్ ఆధ్వర్యంలో విద్యుత్ ఏఈ శ్రీనివాసరావుకు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు.

నున్న సీఐగా కృష్ణమోహన్



పాయకాపురం(విజయవాడరూరల్): నున్న రూరల్ పోలీసు స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పి.కృష్ణమోహన్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేసిన ఎస్.దుర్గాప్రసాద్ టూ ట్రాఫిక్ సీఐగా బదిలీపై వెళ్లారు. ఈ మేరకు నగర పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు ఆదేశాలు జారీ చేశారు.

ప్రజారోగ్యానికి పొగ

- రోడ్డు మార్జిన్‌ల్లో వ్యర్థాలకు నిప్పు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు
- నిర్లక్ష్యం వీడని అధికారులు



కంకిపాడు బైపాస్ మార్గంలో వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో కమ్మేస్తున్న పొగ

కంకిపాడు: ప్రజారోగ్యాన్ని పొగ కమ్మేస్తోంది. రహదారిపై కనీసం సంచరించేందుకు ఆస్కారం లేకుండా పోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అసలే ముక్కుపుటాలు అదిరే దుర్గంధానికి తోడు, వ్యర్థాలు తగలపెట్టడం వల్ల వెలువడే పొగతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అయినా అధికారులు తమ నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తుండటంపై ప్రజల్లో ఆందోళన నెలకొంటోంది.

విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి వెంబడి కంకిపాడు, పెనమలూరు మండలాల్లో పలు గ్రామాలు ఉన్నాయి. ఈ రోడ్డు మార్జిన్ అంతటా చెత్త, వ్యర్థాలతో నిండిపోతుంది. మొక్కుబడిగా వ్యర్థాల తొలగింపు, వ్యర్థాలు, చెత్త వేస్తే జరిమానాలు విధిస్తామంటూ అధికారులు బోర్డులు పెట్టారే కానీ రోడ్డు మార్జిన్‌లపై పర్యవేక్షణ ఏ మాత్రం లేదు. ఫలితంగా పెనమలూరు, కంకిపాడు మండలాల్లో జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న మార్జిన్‌లు చెత్త డంపింగ్ కేంద్రాలుగా మారాయి. వ్యర్థాలు పేరుకుపోయి వాటి నుంచి వచ్చే దుర్గంధంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు అడపాదడపా కురుస్తున్న వర్షాలకు వ్యర్థాలు కుళ్లిపోయి అపరిశుభ్రత వాతావరణం నెలకొంటుంది. దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. దీంతో జాతీయ రహదారి మీదుగా ప్రయాణం అంటేనే ఆందోళన చెందుతున్నారు. అపరిశుభ్రతతో ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లే పరిస్థితులు నెలకొంటున్నాయి. వ్యర్థాలను తొలగిస్తున్నామంటూ అధికారులు చెబుతున్నా పూర్తి స్థాయిలో పనులు సాగడం లేదు. వ్యర్థాల తొలగింపు అంతా మొక్కుబడిగా సాగుతుండటం, పర్యవేక్షణ కొరవడటంతో తిరిగి వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. తాజాగా వ్యర్థాల గుట్టలకు నిప్పు పెడుతున్నారు. వాటి నుంచి వచ్చే పొగ రోడ్డును కమ్మేస్తుంది. గంటల తరబడి పొగ కమ్మేస్తుండటంతో వాహనదారులు రాకపోకల సమయంలో అగచాట్లు పడాల్సి వస్తోంది. వ్యర్థాలతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. జాతీయ రహదారి వెంబడి ఉన్న ఆయా గ్రామాల అధికారులు, జాతీయ రహదారుల శాఖ సరైన పర్యవేక్షణ వహించకపోవడం, బాధ్యతను విస్మరించడంతో సమస్య జఠిలంగా మారుతోంది.

బెంబేలెత్తిస్తున్న వీధి కుక్కలు



వీధి కుక్కల దాడిలో శ్రీను చేతికి అయిన గాయం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులో వీధి కుక్కలు తరుచూ దాడి చేస్తుండటంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ప్రధాన గ్రామంతో పాటు జెండా చెట్టు సెంటర్, ఎస్సీ కాలనీ, శివాలయం పల్లాలు, పంచాయతీ ప్రాంతాల్లో పదుల సంఖ్యలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గ్రామానికి చెందిన మరీదు శ్రీను, అంజయ్య, యేసోబు, వెంకటేశ్వరరావు తదితరులపై వీధి కుక్కలు దాడి చేయడంతో రోడ్డుపైకి రావాలంటేనే గ్రామస్తులు బయపడుతున్నారు. మార్నింగ్ వాకింగ్‌కు వెళ్లిన మరీదు శ్రీనుపై వీధి కుక్క దాడి చేయడంతో చేతికి తీవ్రగాయమైంది. అలాగే గడ్డి కోసం వెళ్లిన అంజయ్య కూడా ఇటీవల వీధి కుక్కల దాడికి గురైయ్యాడు. తరుచూ కనబడిన వారిపై వీధి కుక్కలు దాడి చేస్తుండటంతో కళాశాలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగస్తులు, కార్మికులకు నిత్యం ప్రాణసంకటంగా మారింది. వీధి కుక్కల బెడద ఎక్కువైందని వాటి బెడద నుంచి రక్షించాలని పంచాయతీ కార్యాలయంలో సోమవారం గ్రామస్తులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకుడు కొమరవల్లి కిషోర్ మాట్లాడుతూ వీధి కుక్కల దాడిలో ఇప్పటికే గ్రామంలో సుమారు ఏడు మందికి పైగా గాయాలపాలైయ్యారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

వనజా చంద్రశేఖర్‌కు అభినేత్రి అవార్డు



గన్నవరం రూరల్: కూచిపూడి నాట్య గురువు వనజా చంద్రశేఖర్‌ను అభినేత్రి అవార్డు వరించింది. సేవ్ కూచిపూడి ఆర్టిస్ట్స్ సంస్థ ఆధ్వర్యాన మంగళవారం హైదరాబాద్‌లోని ముచ్చింతల్‌లో ఉన్న చినజీయర్ స్వామి ఆశ్రమంలో ఆమెకు అవార్డు ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు ఆ సంస్థ ఫౌండర్ భావన పెదప్రోలు సమాచారం పంపినట్లు వనజా చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. గన్నవరంకు చెందిన ఆమె నాట్య గురువుగా దేశంలో 1,700 పైగా ప్రదర్శనలు ఇవ్వడంతో పాటు గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించి వందల వేదికలపై సత్కారాలు పొందారు. విద్యార్థులకు శిక్షణ ఇస్తూ కూచిపూడి నాట్యాన్ని నేటి తరానికి అందిస్తూ చేస్తున్న కృషికి ఈ పురస్కారం లభించింది. అభినేత్రి అవార్డుకు ఎంపిక కావడం, సేవ్ కూచిపూడి ఆర్టిస్ట్స్ సంస్థ ఈ అవార్డుకు ఎంపిక చేయడం పట్ల ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కూచిపూడి నాట్యానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. గన్నవరంలోని ఎంతో మంది విద్యార్థులు ఆమె వద్ద శిక్షణ పొందుతూ పలు వేదికలపై ప్రదర్శనలు ఇస్తున్నారు. అభినేత్రి అవార్డుకు ఎంపికైన వనజా చంద్రశేఖర్‌ను పలువురు అభినందించారు.

స్పా కేంద్రంపై పోలీసుల దాడి

పెనమలూరు: స్పా కేంద్రం ముసుగులో జరుగుతున్న వ్యభిచారం వెలుగులోకి వచ్చింది. తాడిగడప శివారు పెదపులిపాక చెరువు వద్ద నూతనంగా నిర్మించిన ఇంట్లో గత కొద్ది కాలంగా గుట్టుగా స్పా ముసుగులో వ్యభిచారం జరుగుతుందన్న సమాచారంతో పోలీసులు సోమవారం దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు మహిళలు, ఒక విటుడిని అదుపులోకి తీసుకున్నారు. విశాఖకు చెందిన స్పా నిర్వాహకురాలు పోలీసులకు దొరకలేదు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. పెదపులిపాక చెరువు వద్ద భవనంలో గత కొద్దికాలంగా ఎస్‌ఎస్ థాయ్ స్పా కేంద్రం ఏర్పాటు చేశారు. అయితే ఇక్కడ వ్యభిచారం జరుగుతోందని మీడియాకు సమాచారం అందింది. ఈ వివరాలు తెలుసుకున్న పోలీసులు భవనంపై నిఘా ఉంచారు. వ్యభిచారం జరుగుతోందని ఆధారాలు లభించడంతో భవనంపై దాడి చేశారు. విశాఖపట్నంకు చెందిన మహిళ స్పా కేంద్రం నిర్వహిస్తోందని పోలీసులు తెలిపారు. పట్టుబడిన మహిళలు విజయవాడ, హైదరాబాద్ ప్రాంతానికి చెందిన వారని తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

శివారు ప్రాంతాలకు విస్తరించిన స్పా కేంద్రాలు

కాగా స్పా కేంద్రాలు నగరాలు వదిలి శివారు ప్రాంతాలకు విస్తరించాయి. స్పా పేరుతో వ్యభిచారం జరుగుతున్నా పోలీసుల నిఘా లేదు. స్థానికులు మీడియాకు సమాచారం ఇవ్వడంతోనే పోలీసులు స్పా కేంద్రంపై దాడులు చేశారు. వ్యభిచారం జరుగుతోందని నిర్ధారించారు. స్పా కేంద్రాలపై పోలీసులు ఎందుకు నిఘా పెట్టడంలేదన్న ప్రశ్నకు సమాధానం లేదు. పోలీసుల నిఘా వ్యవస్థ ఏమయిందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఎక్కడపడితే అక్కడ వ్యభిచార గృహాలు ఉంటే మహిళల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నదీ జలాల పునఃపంపిణీలో రాష్ట్ర హక్కులను కాపాడాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కృష్ణా, గోదావరి నదీ జలాల పునఃపంపిణీ ద్వారా మన రాష్ట్ర నీటి హక్కులను కాపాడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జిల్లా రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాసరావుకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏపీ కౌలురైతుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, ఏపీ రైతు సంఘం ఉపాధ్యక్షుడు మల్నీడు యల్లమందారావు, ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు బుడ్డి రమేష్, ఉపాధ్యక్షుడు పెయ్యల వెంకటేశ్వరరావు, జిల్లా రైతుసంఘం నాయకుడు జి.దేవరాజు, పర్చూరి అజయ్, చెరుకూరి కుటుంబారావు, గుంజె వెంకయ్య తదితరులు పాల్గొని వినతిపత్రం అందజేశారు. వినతిపత్రాన్ని సీఎం చంద్రబాబుకు పంపించి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు నివేదించాలని కోరారు.

ప్రత్యేక ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలి..

ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం - 2014, గత ట్రిబ్యునల్ తుది ఉత్తర్వులకు వ్యతిరేకంగా ఏ విధమైన అనుమతులు లేకుండా తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్న, నిర్మించాలని తలపెట్టిన ప్రాజెక్టులపై చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, దిండి ప్రాజెక్టు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం వంటి ప్రాజెక్టుల వల్ల రాష్ట్రానికి జరిగే నష్టాన్ని ట్రిబ్యునల్ దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ నుంచి రాష్ట్రానికి వాటాగా రావాల్సిన నీరు రాకపోవడం వలన 3, 4 జోన్లకు నీరు అందక రైతులు నష్టపోతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. గోదావరి నది నీటి పంపిణీ విషయం చర్చించేందుకు ఉభయ రాష్ట్రాల మధ్య ప్రత్యేక ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి సంవత్సరం పులిచింతల ప్రాజెక్టులో 30.23 టీఎంసీల నీరు నిలువ ఉండేలా నిర్ణయించి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఏడాది కృష్ణా డెల్టాకు జూన్ నెల మొదటి వారంలో నారుమళ్లు పెంచుకోవడానికి నీటిని విడుదల చేసి డెల్టాలోని కాలువలకు నీరు అందించే విధంగా విధివిధానాలను రూపొందించాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకొని పై అంశాలను చర్చించేందుకు రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు, సాగునీటి రంగనిపుణలతో సమావేశం నిర్వహించాలని వినతి పత్రంలో కోరారు.

వేణు సుదర్శికి సత్కారం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్న ఏపీ శాక్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేణు సుదర్శిని సోమవారం యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యాన ఘనంగా సత్కరించారు. నగరానికి విచ్చేసిన ఆయనను ఏఆర్‌టీ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ గౌతం అంబేడ్కర్ శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా గౌతం అంబేడ్కర్ మాట్లాడుతూ.. అహర్నిశలు ఉద్యోగుల సంక్షేమం కోసం పోరాడుతున్న వేణును ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని పనిచేయాలని సూచించారు. వేణు సుదర్శి మాట్లాడుతూ ఉద్యోగులు సంఘటితంగా ఉండి హక్కులను పరిరక్షించుకోవాలని సూచించారు. ఉద్యోగులకు ఏ సమస్యలు వచ్చినా యూనియన్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య, జిల్లా కమిటీ అధ్యక్షులు మెడబలిమి భాస్కరరావు, మేరుగ ప్రీతి, రాష్ట్ర కార్యవర్గం నాయకురాలు అపర్ణ, ఏఆర్‌టీ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆయిల్‌పామ్‌పై అవగాహన సదస్సు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఆయిల్‌పామ్ సాగులో పాటించాల్సిన మెళకువలు, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు మంగళవారం సదస్సు ఏర్పాటు చేసినట్లు బాపులపాడు మండల ఉద్యాన అధికారి ఇ.హరిచంద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బాపులపాడు మండలం వేలేరుకు చెందిన కనికంట్ల రాజా గోపాలకృష్ణ వ్యవసాయ క్షేత్రంలో ఉద్యాన శాఖ, పతాంజలి ఫుడ్స్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. జాతీయ ఆయిల్‌పామ్ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు, ఉద్యాన అధికారులు ఈ సదస్సుకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఈ సదస్సును ఆయిల్‌పామ్ రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కిరాణాషాపులో చోరీ

కంకిపాడు: కిరాణా షాపులో చోరీ సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు.. మండలంలోని చలివేంద్రపాలెం గ్రామానికి చెందిన దొడ్డ గణేష్‌కుమార్ చలివేంద్రపాలెం-నెప్పల్లి ప్రధాన సెంటర్ సమీపంలో లక్ష్మి జనరల్ స్టోర్స్ నిర్వహిస్తున్నాడు.

ఈనెల 4వ తేదీన రాత్రి దుకాణం మూసి ఇంటికి వెళ్లి తిరిగి సోమవారం ఉదయం దుకాణానికి వచ్చి చూడగా షాపుపై రేకులు పగలకొట్టి కౌంటర్‌లో ఉన్న సుమారు రూ. 60 వేలు నగదు చోరీ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

రెండు బైక్‌లు చోరీ.. కేసు నమోదు

పెనమలూరు: మండల పరిధిలో వేరువేరు ప్రాంతాల్లో రెండు బైక్‌లు చోరీ అవడంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు సనత్‌నగర్‌కు చెందిన కర్రి నాగబాబు మొబైల్ షాపు నిర్వహిస్తాడు. అతను తన బైక్‌ను గత నెల 31వ తేదీన ఇంటి ముందు పార్కు చేసి తిరుపతికి వెళ్లి ఈ నెల 2వ తేదీన తిరిగి ఇంటికి వచ్చాడు. అయితే ఇంటి ముందు పార్కు చేసిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

పెనమలూరులో..

పెనమలూరులో కూడా బైక్ చోరీ జరిగిన ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన షేక్ లాల్‌బాషా తన బైక్‌ను ఇంటి ముందు పార్కు చేయగా గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

సంకల్ప దీక్ష కలిగిన వాడే నాయకుడు



పాయకాపురం(విజయవాడ రూరల్): సంకల్ప దీక్ష కలిగిన వాడే నిజమైన నాయకుడని, వాసవీ క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు రవిచంద్రన్ ఆ కోవకి చెందిన వ్యక్తి అని వాసవీ క్లబ్ అంతర్జాతీయ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. రాజీవ్‌నగర్‌లో వాసవీ భవన్‌లో మూడు రోజుల పాటు జరిగిన 208, 212 అంతర్జాతీయ అధ్యక్షుల పర్యటన కార్యక్రమం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ.. రవిచంద్రన్ గడిచిన ఏడు మాసాల్లో చక్కని శిక్షణా తరగతులు, క్లబ్‌లకు ప్రోత్సాహకాలు ఇవ్వడం, విద్యానిధి ప్రణాళిక అమలు చేయడం, ఇన్‌కమ్‌ట్యాక్స్ వారి నుంచి సెక్షన్ 80(జి) పర్మిషన్ తేవడం లాంటి ఎన్నో ప్రతిష్టాత్మక కార్యక్రమాలు రూపొందించుకొని సేవలందించడం అభినందనీయమన్నారు. అనంతరం రవిచంద్రన్ దంపతులను ఆయన ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి జిల్లా గవర్నర్ కొత్త గణేష్ బాబు అధ్యక్షత వహించగా, మామిడి శ్రీనివాస్, మద్దుల రామచంద్రరావు, రజనీ, పీవీడీ ప్రసాద్, ఆదిశేషు, మాజేటి రాజా, సునీత, సురేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



నున్నలో దోమల నివారణ మందు స్ప్రే చేయిస్తున్న డీఎల్‌పీఓ ఎస్వీఎన్ మూర్తి

నున్న(విజయవాడరూరల్): గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డివిజనల్ పంచాయతీ అధికారి ఎస్వీఎన్ మూర్తి సూచించారు. నున్న గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను డీఎల్‌పీఓ, స్థానిక కార్యదర్శి జీటీవీ రమణతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు కాల్వల్లో నీరు నిలవకుండా ఎప్పటికప్పుడు పారుదలయ్యే విధంగా వ్యర్థాలను తొలగించాలన్నారు. దోమల నివారణకు మలాథియన మందును కాల్వల్లో స్ప్రే చేయించడం వల్ల వాటిని నిర్మూలించవచ్చునని అన్నారు. వర్షాకాలం సీజన్‌లో అంటువ్యాధులు వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయన్నారు. ఈ నెల 9వ తేదీ వరకు ప్రభుత్వం గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తోందని చెప్పారు. అదేవిధంగా తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించాలని, ట్యాంకులు శుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా తాగునీటి పైపులైన్లు లీకేజీలు లేకుండా పర్యవేక్షించాలని పేర్కొన్నారు. గ్రామ సచివాలయ కార్యదర్శులు అజేంద్ర, వరుణ్, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు

గన్నవరం: గన్నవరం మండల తహసీల్దారుగా కేవీ శివయ్య నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటి వరకు తహసీల్దారుగా ఉన్న ఎస్ఎస్ పవన్ కుమార్ స్థానంలో కేవీ శివయ్యను నియమిస్తూ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఉత్తర్వులు జారీచేశారు. తొలుత నూతన తహసీల్దారు శివయ్యకు కార్యాలయ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

పెనమలూరు తహసీల్దారుగా గోపాలకృష్ణ

పెనమలూరు: పెనమలూరు తహసీల్దారుగా కలగర గోపాలకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన తూర్పుగోదావరి జిల్లా రాజోలు నుంచి బదిలీపై పెనమలూరుకు వచ్చారు. గతంలో గోపాలకృష్ణ జిల్లాలోని చల్లపల్లి, బంటుమిల్లి తహసీల్దారుగా పని చేశారు. తహసీల్దారుకు రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

కంకిపాడు తహసీల్దార్‌గా భావన్నారాయణ

కంకిపాడు: కంకిపాడు తహసీల్దారుగా వీ భావన్నారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను కార్యాలయ అధికారులు, వీఆర్‌ఓలు మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. గతంలో నందివాడలో తహసీల్దార్‌గా పనిచేసిన భావన్నారాయణ ఎన్నికల సందర్భంగా పశ్చిమ గోదావరికి బదిలీపై వెళ్లారు. తాజాగా బదిలీపై కంకిపాడు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన తహసీల్దారును మండల రేషన్ డీలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎంసీహెచ్ ఖాసిం, ప్రధాన కార్యదర్శి గొరిపర్తి రామారావు, ప్రతినిధులు దేవరపల్లి కామేశ్వరరావు, టీ కుమారి, కోలా లక్ష్మీభవాని తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం



ప్రొద్దుటూరులో తల్లిపాల వారోత్సవాల్లో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ బేబీ సుకన్య



ఉంగుటూరు మండలం ఆత్కూరులో తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న ఏఎన్ఎంలు

కంకిపాడు: తల్లిపాలు బిడ్డ ఆరోగ్య సంరక్షణకు దోహదపడతాయని ఐసీడీఎస్ కంకిపాడు ప్రాజెక్టు సీడీపీఓ కె.బేబీ సుకన్య అన్నారు. మండలంలోని ప్రొద్దుటూరు ఎంపీపీ పాఠశాల ప్రాంగణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ బేబీ సుకన్య మాట్లాడుతూ పోషకాలతో కూడిన ఆహారాన్ని గర్భిణులు, బాలింతలు తీసుకోవాలన్నారు. పుట్టిన నాటి నుంచి రెండేళ్ల వయస్సు వచ్చే వరకు బిడ్డకు తల్లిపాలే పట్టాలని సూచించారు. సూపర్‌వైజర్ ఎస్.అన్నామణి మాట్లాడుతూ తల్లిపాలలో ఉన్న పోషకాలు చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తాయని వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ఎం.కుసుమ, ఎంఎస్‌కె. విమలకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఉంగుటూరు: తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సచివాలయ ఏఎన్ఎంలు అన్నారు. మండలంలో పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలను సోమవారం నిర్వహించారు. తల్లిపాలు శ్రేష్ఠమైనవని బిడ్డకు పోషకాహారాన్ని అందజేస్తాయని ఏఎన్ఎంలు చెప్పారు. తల్లి పాల ప్రాముఖ్యతను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కొత్తపల్లిలోని ముస్లిం ఏరియా అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యాన ప్రపంచ తల్లిపాల దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. నవజాత శిశువుకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని, దీనిపై అపోహలను విడిచిపెట్టాలని చెప్పారు. శిశువుకు మొదటి ఆరునెలల పాటు తల్లిపాలు మాత్రమే తాగించాలని, దీని వల్ల పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. అంతేకాక తల్లి, బిడ్డల మధ్య ప్రేమానురాగాలు పెరుగుతాయని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన సమతుల్య ఆహారం గురించి వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు కోటేశ్వరమ్మ, ఎం.జ్యోతికుమారి, చిన్న బీబీ జాన్, ఏఎన్ఎం శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ కళలను పరిరక్షించుకోవాలి



నాట్యాచారిణి శ్రీదేవిని సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: సంప్రదాయ కళలను పరిరక్షించుకోవాలని సంగీత విద్వాంసుడు కేవీ బ్రహ్మానందరావు చెప్పారు. తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, సంగీత సమ్రాట్ కళాసంస్థ, కేవీ బ్రహ్మానందరావు కళావేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై సోమవారం తిరుపతికి చెందిన కళాకారుల భరత నాట్య ప్రదర్శన, నాట్యాచారిణి కే శ్రీదేవికి ఆత్మీయ సత్కారం, సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు.

కళాకారులు సాంస్కృతిక వారధులు

ముఖ్య అతిథిగా పాల్గొన్న బ్రహ్మానందరావు మాట్లాడుతూ.. కళాకారులు సాంస్కృతిక వారధులని, వారి సేవలను గుర్తించి ప్రోత్సహించాలని చెప్పారు. శ్రీ కళాభారతి వ్యవస్థాపకుడు శింగంశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కళా సంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలని సూచించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు ఆధ్వర్యంలో నాట్యాచారిణి శ్రీదేవి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆకాశవాణి విశ్రాంత కార్యక్రమ నిర్వాహకుడు ఏబీ ఆనంద్, బోడి ఆంజనేయరాజు, డేవిడ్‌రాజు పాల్గొన్నారు. గాయనీ గాయకులు పలు చిత్ర గీతాలను ఆలపించారు.

17న నృత్యనీరాజనం - 2024

విజయవాడ కల్చరల్: శ్రీ వాగ్దేవీ కూచిపూడి నృత్యాలయ ఆధ్వర్యంలో 17వ తేదీ శనివారం గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో నృత్య నీరాజనం - 2024 కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నాట్యాచార్య సప్పా శివకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 గంటల పాటు జరిగే కార్యక్రమంలో గురుసత్కారంతో పాటు ప్రతిభ చూపిన కళాకారులకు శ్రీ వెంకటేశ్వర, బసవ నంది పురస్కారాలతో సత్కరిస్తామన్నారు. ప్రత్యేక కార్యక్రమంగా కూచిపూడి సిద్ధేంద్రయోగి కళాపీఠం విశ్రాంత ఆచార్యులు డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రిని ఘనంగా సత్కరిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన నృత్య కళాకారులు 970 107 7636 నంబరును సంప్రదించాలని కోరారు.